సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని నిర్ణయించారు.

- 8లో▸



కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
38.2^0 / 25.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



తొర్రూరు రూరల్: అకాల వర్షాలు, గాలివాన బీభత్సానికి పాడైన, సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అరిపిరాల గ్రామంలో గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు.. రైతుల సంక్షేమం, అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం, బోనస్, రైతు బంధు, రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మాజీ జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు కుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌కే అంకూస్, కొండ వెంకన్న, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో గురువారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. మహబూబాబాద్ నుంచి ఇర్సులాపురం మీదుగా ఇల్లెందుకు బస్సు సౌకర్యం కల్పించాలని, మహబూబాబాద్ నుంచి సూర్యాపేటకు వయా కందికొండ, మరిపెడ మీదుగా బస్సు నడపాలని ప్రజలు, ప్రయాణికులు కోరినట్లు ఆయన పేర్కొన్నారు. మానుకోట నుంచి మణుగూరుకు వయా కొత్తగూడెం, పాల్వంచ మీదుగా బస్సులు నడిపించాలని ఫోన్ల ద్వారా కోరినట్లు డీఎం తెలిపారు. ప్రయాణికులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఆర్టీసీ బస్సులు, అదనపు ట్రిప్పుల కోసం ప్రయాణికులు డయల్ యువర్ కార్యక్రమంలో వినతి చేసినట్లు తెలిపారు.

తాలు రాకుండా వరి పంట కోయాలి

- ఏడీఏ శ్రీనివాసరావు



మహబూబాబాద్ రూరల్: వరికోత మిషన్ల యజమానులు వరి పంటలను తాలు రాకుండా కోయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని వేమునూరు గ్రామంలో యాసంగిలో పండిన వరి పంటను ఏడీఏ శ్రీనివాసరావు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట కోతలను పర్యవేక్షించారు. వరి కొత్త మిషన్లతో వరి పంటకోతలు జరుగుతున్న తీరును గమనించి.. రైతులు గింజ గట్టి పడిన తర్వాత వరి పంట కోస్తే తాలు రాకుండా ఉండి లాభం జరుగుతుందని తెలిపారు. ఇందిరానగర్ కాలనీ గ్రామంలో పర్యటించి ఇటీవల కురిసిన వడగండ్ల వాన, గాలి, దుమ్ము వల్ల జరిగిన వరి పంట నష్టాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజ్ సూచించారు. గురువారం మండలంలోని మడిపెల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. ప్రతి కూలీకి కనీస వేతనం రూ.307 చెల్లించే విధంగా పనులు చేయించాలన్నారు. ఉదయం 6నుంచి 11గంటల వరకే పనులు చేయించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్ వంటి వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ అధికారులు మధు, కృష్ణ, సుధాకర్, సతీష్ పాల్గొన్నారు.

డిప్యుటేషన్ల లొల్లి

ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లపై కలెక్టర్ ఆగ్రహం

- కొత్తగా ఎవరిని కదిలించొద్దని ఆదేశం
- పాత డిప్యుటేషన్లు రద్దు చేయాలని సూచన
- నూతన డీఎంహెచ్‌ఓకు తలనొప్పిగా మారిన వ్యవహారం



సాక్షి, మహబూబాబాద్: ఎంత మంది అధికారులు వచ్చినా.. ఎవరు మారినా.. జిల్లా వైద్యారోగ్యశాఖలోని అధికారులు, ఉద్యోగుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఉద్యోగ నియామకాలు, బదిలీలు, పదోన్నతులతో వెళ్లిన చోట పనిచేయకుండా కొందరు ఉద్యోగులు పైరవీలతో డిప్యుటేషన్లపై వేరేచోటుకు వెళ్లడం పరిపాటిగా మారింది. అయితే ప్రస్తుతం ఎక్కడి వారు అక్కడే పనిచేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేయడంతో తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లిన వారు.. తప్పని పరిస్థితుల్లో మదర్ పోస్టింగ్ స్థానానికి వెళ్లాల్సి వస్తోంది. కాగా ఇన్నిరోజులు ఉన్నతాధికారులకు తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా డిప్యుటేషన్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

అంతా గందరగోళం

కొత్తగా వచ్చిన డీఎంహెచ్‌ఓ రవి జిల్లా వైద్యారోగ్యశాఖలోని ఉద్యోగులు ఎవరెవరూ ఎక్కడ పనిచేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయగా.. అంతా గందరగోళంగా ఉన్నట్లు స్పష్టమైంది. మదర్ పోస్టింగ్ ఎక్కడ అనే విషయంపై డిప్యుటేషన్లపై వచ్చిన వారు నోరు మెదపలేదని తెలిసింది. అయితే జిల్లాలోని 21ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఒక బస్తీ దవాఖాన, అర్బన్ పీహెచ్‌సీల్లో ఎవరెవరూ పనిచేస్తున్నారనే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఇందుకోసం డాక్టర్ల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు వారివారి మదర్ పీహెచ్‌సీల్లో చేరాలని, అలా అయితేనే వచ్చే నెల వేతనాలు చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. ఇందుకోసం వారం రోజుల గడువు ఇచ్చి ఈలోపు అంతా పూర్తి కావాలని చెప్పినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు వెళ్లిందే ఉద్యోగం చేసిందే పని అన్నట్లుగా ఉన్న కొందరు అధికారులు, సిబ్బంది మారుమూల ప్రాంతాల్లోని తమ మదర్ పోస్టింగ్‌కు వెళ్లాల్సి వస్తోంది. మరికొందరు డిప్యుటేషన్ కొనసాగించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులతో పైరవీలు కూడా చేస్తున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితిలో కొత్తగా వచ్చిన డీఎంహెచ్‌ఓ డిప్యుటేషన్లు రద్దు చేస్తారా.. లేదా ఒత్తిడికి తలొగ్గి కొనసాగిస్తారా.. అలా చేస్తే జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారనేది జిల్లాలో చర్చగా మారింది.

ఇష్టారాజ్యంగా..

గతంలో పనిచేసిన అధికారులు, కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి కీలక పాత్ర పోషించి డిప్యుటేషన్లు వేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, మూడు రకాల ఏఎన్‌ఎంలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు మొత్తం 150మందికి పైగా ఉన్నట్లు సమాచారం. డిప్యుటేషన్ వేసినందుకు ఆశాఖలోని అధికారులకు ముడుపులు అప్పగించినట్లు జిల్లాలో చర్చ జరిగింది. అయితే ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధికారి డిప్యుటేషన్లు రద్దు చేయాలని ఆదేశించారు. కాగా జిల్లా అధికారి ముందు తల ఊపిని వైద్యారోగ్యశాఖ అధికారులు కొందరి డిప్యుటేషన్లు రద్దు చేసి.. వారికి అనుకూలంగా ఉన్న వారిని అలాగే ఉంచినట్లు సమాచారం. తర్వాత మరికొందరు డిప్యుటేషన్లపై అనుకూల ప్రదేశాలకు వెళ్లేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారిని సంప్రదించినట్లు తెలిసింది. అయితే గతంలో డిప్యుటేషన్ రద్దు చేసిన వారితో పాటు, కొత్తవారితో కూడిన జాబితాను తయారు చేసి.. అప్రూవల్ కోసం కలెక్టర్‌కు పంపినట్లు తెలిసింది. ఈ విషయం ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ కొత్త వారికి డిప్యుటేషన్లు ఇవ్వకపోగా.. ఇప్పటి వరకు డిప్యుటేషన్లపై పని చేస్తున్న వారి ఆర్డర్లు కూడా రద్దు చేయాలని ఆదేశించారు.

డిప్యుటేషన్లు రద్దు చేస్తాం ..



జిల్లా వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల డిప్యుటేషన్ అంతా గందరగోళంగా ఉంది. దీనిని సరి చేసేందుకు ముందుగా పీహెచ్‌సీల్లో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు ఎంత మంది ఉన్నారో తెలవడం లేదు. ఇందుకోసం ఉద్యోగుల వారీగా సమావేశాలు పెట్టి డిప్యుటేషన్లపై వెళ్లినవారు వారి సొంత పోస్టింగ్‌కు వెళ్లాలని చెప్పాం. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి అవుతుంది. అప్పుడు ఉద్యోగులపై ఒక అంచనా వస్తుంది.

- రవి, డీఎంహెచ్‌ఓ, మహబూబాబాద్

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

కురవి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తోందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని గుడి సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, నెల్లూరు నాగేశ్వర్‌రావు, తురక రమేశ్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, నర్సింగం గురవయ్య, ఉప్పలయ్య, బొల్లు వెంకన్న, కలగూర నాగరాజు, జిన్న వీరయ్య పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న నాయకులు

రైతు ఇంట్లో కలెక్టర్ భోజనం



గోవింద్ ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఈమేరకు గురువారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మహబూబాబాద్ మండలంలోని జరుపులతండా గ్రామ పంచాయతీ పరిధి చీకటిచింతల తండాలో రైతు బానోతు గోవింద్ ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం తిన్నారు. గోవింద్ కుటుంబ సభ్యులను బియ్యం పంపిణీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. వారివెంట జిల్లా సివిల్ సప్లయాస్ అధికారి ప్రేమ్ కుమార్, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సన్నబియ్యం..

నెల్లికుదురు: లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించాలని, దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే డీలర్‌పై చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రేషన్ షాపును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న రాజీవ్ యువవికాసం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నెల్లికుదురు, మునిగలవీడు గ్రామాల పరిధిలో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ప్రేమ్ కుమార్, కె.రాజు, ఎంపీడీఓ బాలరాజుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' రీడిజైన్ అవినీతిపై విచారణ చేపట్టాలి

గార్ల: ఇల్లెందు నియోజకవర్గంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ గురువారం గార్లలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు అఖిలపక్షం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు నియోజకవర్గాల ప్రజలకు సాగు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టు చేపట్టారన్నారు. అయితే ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలను విస్మరించి నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రాజెక్టు రీడిజైన్ చేశారని అఖిలపక్ష నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు నీళ్లు ఇల్లెందు నియోజకవర్గానికి వచ్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అఖిలపక్ష నాయకులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, జంపాల విశ్వ, సత్రు, కట్టెబోయిన శ్రీనివాస్, పెద్దవెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

మహబూబాబాద్ రూరల్: యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో హోంగార్డుల పిల్లలకు అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుష్పాల అశోక్, సంఘం మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు జన్ను జంపయ్య, సత్యనారాయణ, బంక శ్రీను గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా కార్పొరేట్ స్కూళ్లతో సమానంగా అన్నిరకాల వసతులు కల్పిస్తూ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించారన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వారి పిల్లలకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కురవి: ధాన్యం కాంటా వేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు అధైర్యపడొద్దని, రైతు భరోసా ఇచ్చామని, రుణమాఫీ పూర్తిగా చేస్తామన్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటుందన్నారు. అలాగే కురవి మండలం మొగిలిచర్లలో పల్లె దవాఖానను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ శారద, ఏఓ చాయారాజ్, కాలం రవీందర్‌రెడ్డి, రమేశ్, శంకర్‌నాయక్, ఎం.సురేష్, నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి పెద్దపీట..

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ తెలిపారు. మండలంలోని మన్నెగూడెం, వెన్నారం గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఉయ్యాలవాడ గ్రామంలోని పలు వీధుల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. డోర్నకల్‌లో శాంతినగర్, బైపాస్ రోడ్డు, చర్చికాంపౌండ్‌లో నూతనంగా నిర్మించిన సబ్‌సెంటర్ భవనాలను ప్రారంభించారు.అనంతరం బిషప్ అజరయ్య ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, రూ.1.26 కోట్ల వడ్డీలేని రుణాలకు సంబంధించిన చెక్కును మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ శ్రీ నివాసనాయక్, మున్సిపల్ చైర్మన్ ఉదయ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం శంకర్‌నాయక్, సీఈఓ సతీష్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుధాకర్‌నాయక్, మండల వైద్యాధికారి సాధ్విజ పాల్గొన్నారు.

బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

నెహ్రూసెంటర్: రాష్ట్ర విభజన హామీలను అమలు చేసి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతుందని విమర్శించారు. బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ సంస్థలకు కాకుండా, ప్రభుత్వమే పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, దుడ్డెల రాంమూర్తి, సత్యవతి, గాడిపెల్లి ప్రమీళ, గునిగంటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగం' ఆడియో సీడీ ఆవిష్కరణ



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

విద్యారణ్యపురి: కవి, ప్రజా కళాకారుడు, జాతీయ ఉపాధ్యాయ ఉత్తమ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు రచించి స్వరపరిచిన 'మన భారత రాజ్యాంగం' ఆడియో సీడీని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ఆవిష్కరించారు. గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, వీఆర్‌విద్యార్థి, పి.కృష్ణమాచారి, ప్రొఫెసర్ రతన్‌సింగ్‌ఠాకూర్, జోలి రాజలింగం, బండా కాళిదాస్, మండల పరశురాములు, సామాజిక కార్యకర్త నల్లమూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ ఉంటేనే రిజిస్ట్రేషన్!

త్వరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు

- ప్రస్తుతం మాన్యువల్‌తో పాటు స్లాట్‌బుకింగ్ రిజిస్ట్రేషన్లు
- ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియతో ఆఫీస్‌లో సందడి
- పెరిగిన మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు
- జిల్లాలో మరో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



మానుకోటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక సంస్కరణలు చేస్తోంది. దీనిలో భాగంగా స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు పైలట్ ప్రాజెక్ట్ కింద గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించింది. త్వరలోనే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు చేయనున్నారు. ప్రస్తుతం కూడా స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఉన్నప్పటికీ చాలా మంది మాన్యువల్‌గా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరం మార్చి నెలలో మానుకోట రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లతో పాటు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

జిల్లాలో 27,610 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు..

జిల్లాలోని మానుకోట, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో మొత్తం 27,610 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా..వాటిలో 18,467 ఆమోదించారు. ఇందులో 4,749 దరఖాస్తులకు మాత్రమే ఫీజు చెల్లించారు. 2022 ఆగస్టు 26లోపు లేఅవుట్ లేని ప్లాట్లు కొనుగోలు చేసిన వారి కోసం ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టారు. కాగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించడానికి మార్చి 31వరకు ఇచ్చిన గడువును ఈ నెల 30 వరకు పొడిగించారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులు గత నెల 12నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

కాస్త ఊరట..

ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన నాటి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడి నెలకొంది. రియల్ ఎస్టేట్ రంగంలో కొంత ఊపువచ్చి మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. గత నెల సుమారు 15 రోజుల్లోనే 150 ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు అయినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

స్లాట్ బుకింగ్‌తోనే..

ప్రస్తుతం స్లాట్ బుకింగ్‌తో సంబంధం లేకుండా మాన్యువల్ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. స్లాట్ బుకింగ్ చేసుకుని వచ్చే వారి సంఖ్య చాలా తక్కువ. కాగా ప్రభుత్వం ప్రతీ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేసేలా ప్లాన్ చేస్తోంది. త్వరలో మానుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ఆ విధానం అమలు కానుంది. కాగా స్లాట్ బుకింగ్ వల్ల సమస్యలు ఉన్నాయని, ఆవిధానం వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గుతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు.

త్వరలో మరో కార్యాలయం..

జిల్లాలోని మరిపెడ, తొర్రూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తొర్రూరులో ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. అలాగే డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మరిపెడలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా రెండు మంజూరు చేస్తారా.. లేదా ఒకటే అయితే ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై స్పష్టత లేదు. దాదాపు ఈనెలలోనే ఏర్పాటు చేస్తారని ప్రచారం జరుగుతోంది.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో పలుచోట్ల మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి. మండల కేంద్రంతో పాటు మొద్దులగూడెం, ప్రాజెక్ట్‌నగర్, పస్రా, చల్వాయి, దుంపెల్లిగూడెం, లక్ష్మీపురం, కర్లపల్లి, బుస్సాపూర్, మచ్చాపూర్, గొత్తికోయ గూడేల్లో బుధవారం అర్ధరాత్రి ఆదివాసీ యువజన సంఘం పేరిట మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి. ఈ కరపత్రాల్లో 'మమ్మల్ని బతకనివ్వండి.. నిత్యం ఆదివాసీ ప్రజలపై ఆధారపడి బతికే మీరు అడవుల్లో విచ్చలవిడిగా మందుపాతరలు పెట్టడం సరికాదు.. ఇదేనా మీ సిద్ధాంతం అంటూ' ఆదివాసీ సంఘాల పేరుతో ప్రశ్నలు కనిపించాయి. ఈ పోస్టర్లు ఎవరు వేశారనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అలాగే మంగపేట, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల్లోని పలు గ్రామాలు, గూడేల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి.

రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో అసంతృప్తి



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సత్యవతిరాథోడ్, శంకర్‌నాయక్

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

గూడూరు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చెరువులన్నీ చేపలతో నిండుకొని, పంటలన్నీ పచ్చగా ఉండగా, నేటి కాంగ్రెస్ పాలనలో చెరువులు, బావులు, బోర్లలో నీరు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయన్నాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని వాపోయారు. ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి 10వేల మందిని తరలించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్టారెడ్డి, ఎండి ఖాసీం, మోతీలాల్, నూకల సురేందర్, కిషన్‌నాయక్, కతార్‌సింగ్, నర్సింహనాయక్, సంపత్‌రావు, వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ వైద్యుడిపై కేసు నమోదు



ఆప్టికల్స్ షాపును పరిశీలిస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు

ఎంజీఎం : నగరంలోని జేపీఎన్ రోడ్డులోని డెక్కన్ ఆప్టికల్స్ యజమాని ఎం.జనార్దన్ కంటి వైద్యుడిగా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు గుర్తించినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజాసంబంధాల కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు నకిలీ వైద్యుడు ఎం.జనార్దన్‌పై కౌన్సిల్ రిజిస్ట్రార్ డి.లాలయ్యకుమార్, చైర్మన్ కె.మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసినట్లు నరేశ్ తెలిపారు. ఆప్టోమెట్రిస్టులు, సహాయకులు రెఫ్రాక్షన్ సేవలు (కంటి డిగ్రీలు కొలవడం) మాత్రమే చేయాలన్నారు. కానీ వైద్య సలహాలు ఇవ్వడం, కంటి వ్యాధులకు మందులు సూచించడం లేదా శస్త్ర చికిత్సల పేరుతో మోసం చేయడం చట్టవిరుద్ధమని వివరించారు. ఇలా ఎలాంటి అర్హత లేకుండా వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ వైద్యుల బారిన పడితే పోలీసులు లేదా మెడికల్ కౌన్సిల్‌కు antiquackerytmc@onlinetsnc.in మెయిల్ ద్వారా లేదా 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

దామెర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని పోచమ్మకుంట సగరవీధికి చెందిన వేముల మల్లేశం(46) తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మండలకేంద్రంలో ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం కూలీ పనికి వచ్చాడు. మధ్యాహ్న సమయంలో పనులు చేసుకుంటూ కళ్లు తిరుగుతున్నాయని పక్కకు వెళ్లి కూర్చొని కుప్పకూలాడు. దీంతో స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

వాగులో పడి వృద్ధుడు..

శాయంపేట: మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల రాజమొగిలి (85) గురువారం వాగులో పడి మృతి చెందాడు. రాజమొగిలి మతిస్థిమితం కోల్పోయి ఇంటి వద్దే ఉంటున్నాడు. రాజమొగిలికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె. గతంలో అతడి భార్య మృతి చెందగా.. రాజమొగిలి కొడుకుల వద్దే ఉంటున్నాడు. గురువారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఆయన కుమారులు వెతకగా.. మండలంలోని గట్లకానిపర్తి శివారులోని వాగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సముద్రాల గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే పరీక్షలు నిర్వహిస్తాం
- ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల స్పష్టీకరణ
- పరీక్షలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ముడిపెట్టొద్దు : రిజిస్ట్రార్
- విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసూలు చేసినా యూనివర్సిటీకి చెల్లించని ప్రైవేట్ యాజమాన్యాలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ వొకేషనల్ తదితర కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని పరీక్షల విభాగం అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే అయా పరీక్షలు నిర్వహణకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సిద్ధంగా లేవు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, అందుకే తాము ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు నిర్వహించబోమని కొద్దిరోజుల క్రితమే సంఘం బాధ్యులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షలు జరుగుతాయా లేదా అనే అంశంపై ఆందోళన చెందుతున్నారు.

5న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ సమావేశం

ఈనెల 5న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సమావేశం నిర్వహించుకున్నాయి. ఇందులో పలు తీర్మానాలు చేసుకున్నాయని సమాచారం. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి అలాగే ఉంచుకోవాలని, యూనివర్సిటీకి ఎప్పుడు చెల్లించాలని నిర్ణయిస్తే అప్పుడు వెంటనే చెల్లించాలని, ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాలను నామినల్ రోల్స్(ఎన్ఆర్)లో ఎంటర్ చేయాలని నిర్ణయించాయి.

1, 3, 5వ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించేందుకు..

కేయూ పరిధిలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు గత నెల 4న విడుదలైన విషయం విధితమే. అప్పట్లో యూనివర్సిటీ అకడమిక్ డీన్ విభాగానికి చెల్లించాల్సిన వివిధ రకాల ఫీజులు చెల్లించని కాలేజీల ఫలితాలు నిలిపిన విషయం విధితమే. ఆ తర్వాత ఎక్కువ శాతం కళాశాలలు చెల్లించినా ఆయా ఫీజులు 40కిపైగా కాలేజీలు చెల్లించలేదు. అయినా అన్ని కళాశాలల విద్యార్థుల ఫలితాలను చివరికి అధికారులు విడుదల చేశారు. నాలుగైదు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఫీజులు చెల్లించకపోయినా పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. అయితే ఆ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువ ఉండడంతో మళ్లీ ఆయా పరీక్షలు నిర్వహించేందుకు, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువు ఇచ్చారు. అపరాధ రసుములేకుండా ఈనెల 11తో ముగియబోతుంది. ఆ పరీక్ష ఫీజులు కూడా విద్యార్థుల నుంచి ప్రైవేట్ యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఈ ఫీజులు కూడా యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లిస్తే డిగ్రీ 2,4,6 సెమిస్టర్లతోపాటే 1,3,5 సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించాలనే యోచనలో పరీక్షల విభాగం అధికారులున్నారు.

73 కళాశాలల వరకే పరీక్ష ఫీజులు చెల్లింపులు..

కేయూ పరిధిలో 292 వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాలు, అటానమస్ డిగ్రీ కళాశాలలున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫీజులు చెల్లించేందుకు అధికారులు ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 9వతేదీతో గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు అన్ని యాజమాన్యాలు కలిపి కేవలం 73 కళాశాలల వరకే యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి ఫీజులు చెల్లించాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజులు వసూలు చేశారు. కానీ ఆ యాజమాన్యాలు గురువారం వరకు యూనివర్సిటీకి చెల్లించలేదు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ ఈ విద్యార్థుల పరీక్షల ఫీజులు యూనివర్సిటీకి చెల్లించొద్దని, పరీక్షలను కూడా నిర్వహించబోమని నిర్ణయంచుకున్నాయి. దీంతో వేలాది మంది విద్యార్థులు రాసే పరీక్షల నిర్వహణపై ప్రతిష్టంభన ఏర్పడింది.

పరీక్షల ఫీజు చెల్లించాలి



కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించేందుకు ఆ విభాగం సిద్ధంగా ఉంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లించాల్సింటుంది. ఇంకా చెల్లించడం లేదు. ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తాం. ఎందుకంటే ఫైనలియర్ విద్యార్థులకు ఇబ్బంది ఉంటుంది కాబట్టి. పరీక్ష నిర్వహణ ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ముడిపెట్టొద్దు.

-ఆచార్య రామచంద్రం, రిజిస్ట్రార్, కేయూ

తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభాస్థలి పరిశీలిన



బహిరంగ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి: తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నడూ కొట్లాడిందిలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపాన ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభాస్థలిని ఆయన గురువారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ సుమారు 1,200 ఎకరాల స్థలంలో సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు నాలుగు వైపులా రూట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సంవత్సరంన్నర కాంగ్రెస్ పరిపాలన అట్టర్‌ఫ్లాప్ అయిందని, ఆ పార్టీని గెలిపించి మోసపోయామని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. నీళ్లు లేవు.. పెట్టుబడిలేదు.. కరెంటు లేదు.. కళ్యాణలక్ష్మి లేదు.. కేసీఆర్ కిట్టు లేదు.. తండాలకు రోడ్లు లేవన్న విషయాన్ని ప్రజలు రివ్యూ చేసుకుంటున్నారని తెలిపారు. నీళ్లు లేక పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను చూడాలే.. ఆయనకు ధైర్యం చెప్పాలన్న కుతుహలంతో ఎదురుచూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాగుర్ల వెంకన్న, సదానందం, పిట్టల మహేందర్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, తంగెడ మహేందర్, జూపాక జడ్సన్ పాల్గొన్నారు.

కేయూ బంద్ విజయవంతం



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌చేసి 21జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యామండలి ముట్టడికి పిలుపునివ్వగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. దీనికి నిరసనగా గురువారం కేయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన బంద్ విజయవంతమైంది. క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం, పరీక్షల విభాగం, ఆడిట్, యూజీసీ తదితర కీలక విభాగాలన్నింటినీ బంద్ చేయించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలను కూడా బంద్ చేయించారు. అనంతరం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు పి. కరుణాకార్‌రావు, సాధురాజేశ్, శ్రీధర్‌కుమార్‌లోథ్, బి.సతీశ్, మాదాసి కనకయ్య మాట్లాడుతూ కొన్నేళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్‌చేయాలన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాకే కొత్తగా అధ్యాపక పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కాగా, రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆశీర్వాదం, సంకినేని వెంకట్, భిక్షపతి, రవీందర్, గడ్డం కృష్ణ, జూలసత్య, నాగయ్య, సూర్యనారాయణ, కవిత, శ్రీదేవి, స్వప్న, వీణ, సునీత, ఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



సంజయ్‌కుమార్ (ఫైల్)

కాజీపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట భవానీనగర్‌కు చెందిన ఊరడి సంజయ్ కుమార్(26) సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వర్తిన్నాడు. ఈ క్రమంలో ఇటీవల రూ. 76 లక్షలతో ఇదే కాలనీలో నూతన ఇంటిని కొనుగోలు చేశాడు. ఇంటి రిజిస్ట్రేషన్ తదితర ఖర్చులు అధికం కావడంతో అప్పులు పెరిగాయి. అప్పులు, వడ్డీలు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన సంజయ్‌కుమార్..బాపూజీనగర్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వడ్డేపల్లి చెరువులో పడి నిట్ విద్యార్థి..



రిత్విక్‌సాయి మృతదేహం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో నిట్ వరంగల్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రుత్విక్ సాయి(23) నిట్ వరంగల్‌లో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం ఆ యువకుడి మృతదేహం చెరువులో తేలియాడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, రిత్విక్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

పిడుగు పాటుకు పశువుల మృత్యువాత



మృత్యువాత పడిన పశువుల వద్ద రోదిస్తున్న రైతు ఎల్లయ్య

బచ్చన్నపేట : పిడుగుపాటుకు మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని కట్కూర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రికింది ఎల్లయ్య బుధవారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద రెండు ఎడ్లు, ఓ పాడి గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం ఈదురుగాలులతో పాటు పిడుగులు పడ్డాయి. దీంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా మూడు పశువులు మృత్యువాత పడి కనిపించగా బోరున విలపించాడు. ఈ ఘటనలో దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, బాధిత రైతు ఎల్లయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, అరసం బాధ్యులు

విద్యారణ్యపురి: కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని, ప్రజలను చైతన్యవంతం చేసేలా రచనలు ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. బుధవారం రాత్రి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం)90వ ఆవిర్భావ దినోత్సవం హనుమకొండలోని ఆదర్శ 'లా' కాలేజీలో నిర్వహించారు. ఈ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహించారు. అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో బ్రిటిష్ వలసవాదం, దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు లక్నోలో 1936 ఏప్రిల్ 9,10తేదీల్లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు అయిందన్నారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ మాట్లాడుతూ దేశంలో నాడు ఏ పరిస్థితులున్నాయో ఇప్పటికీ అవే పరిస్థితులు ఉన్నాయన్నారు. అణిచివేత కొనసాగుతోందన్నారు. అనంతరం పల్లేరు వీరస్వామి రచించిన 'వీక్షణాలు', కేవీఎల్ రచించిన 'లింగమ్మ' పుస్తకాన్ని అంపశయ్య నవీన్ , ప్రముఖ కవి బన్న అయిలయ్య ఆవిష్కరించారు. అరసం ఉపాధ్యక్షురాలు చందనాలసుమిత్ర పుస్తక సమీక్ష చేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి రజిత, బాధ్యులు మార్కశంకర్‌నారాయణ, నిధి, బూర భిక్షపతి, బూర విద్యాసాగర్, పాంచల్ రాయ్ మాట్లాడారు. న్యాయవాది ఏరుకొండ జయశంకర్, హనుమకొండ భారత్‌బచావో చైర్మన్‌రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ ఇంటికి వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వృద్ధుడి దుర్మరణం
- వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఘటన
- నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లిలో విషాదం



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖిలా వరంగల్ : కొత్త వాహనానికి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అదే వాహనంపై బిడ్డ ఇంటికి వెళ్తూ ఓ వృద్ధుడు మృత్యుఒడికి చేరాడు. రోడ్డు ప్రమాదంలో దర్మరణం చెందాడు. ఈ ఘటన వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పావులూరి వెంకటేశ్వర్లు (60) పర్వతగిరి మండల కేంద్రంలో నివాసముంటూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కొత్త బైక్‌ను కొనుగోలు చేశాడు. గురువారం ఉదయం వాహన రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి చేరుకున్నాడు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే మధ్యాహ్నం హనుమకొండలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద టిప్పర్ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలియడంతో స్వగ్రామం సాయిరెడ్డిపల్లి, ప్రస్తుతం ఉంటున్న పర్వతగిరి మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుమార్తె బొర్ర కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. బావిలో శవమై కనిపించి

- అనుమానాస్పదస్థితిలో వ్యాపారి మృతి
- చిన్నముప్పారంలో ఘటన



కిశోర్ (ఫైల్)

నెల్లికుదురు: ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యాపారి అనుమానాస్పదస్థితిలో వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. ఈ ఘటన గురువారం ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓబిలిశెట్టి కిశోర్ (40) కిరాణ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు కిశోర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కట్ల ఐలయ్య వ్యవసాయ బావివద్ద కిశోర్ వాహనం కనిపించింది. దీంతో వ్యవసాయ బావిలో చూడగా మృతి చెంది శవమై కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, కిశోర్ మృతికి కుటుంబ కలహాల లేదా.. మరే ఇతర కారణమా అనే విషయం తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

పీజీ కోర్సుల పరీక్షలు వాయిదా వేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు టైంటేబుల్‌ను కూడా ఇటీవల వెల్లడించారు. అయితే, పలువురు విద్యార్థులు ఆయా పరీక్షలు వాయిదా వేయాలని పరీక్షల విభాగం అధికారులకు గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగం అధికారులు మాట్లాడుతూ సకాలంలో పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలను కూడా త్వరగా వెల్లడించే వీలుంటుందని, టైంటేబుల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈక్రమంలో పరీక్షలు వాయిదా వేయాల్సిందేనని విద్యార్థులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

నేటి నుంచి లలితాయాగం



రాజరాజేశ్వరి దేవి అమ్మవారు


హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం నుంచి నాలుగురోజుల పాటు లలితా యాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి పూర్వంగం, అగ్నిప్రతిష్ట, తిథి నిత్య హోమాలు, లలితా హోమం, రాత్రి 8గంటలకు దశ విధహారాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. రోజూ హోమం జరుగుతుందని తెలిపారు. సోమవారం హోమం మహాపూర్ణాహుతి జరుగుతుందని వివరించారు.

పశుదాణాకు ప్రత్యామ్నాయం.. 'అజొల్లా'



అజొల్లా తయారీ విధానం





అజొల్లాను తింటున్న కోళ్లు, పశువులు

- వేసవిలో పాడి పశువులకు దాణాగా వాడొచ్చు
- ఈ మొక్కలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్ అధికం

మహబూబాబాద్ రూరల్ : అజొల్లా.. ఆకుపచ్చ రంగులో ఉండే ఫెర్న్ జాతికి చెందిన మొక్క. దీనిలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్, విటమిన్ బీ2 ఎక్కువ ఉంటాయి. ఇది తక్కువ శాతం లిగ్నిన్ కలిగి సులభంగా జీర్ణమవుతుంది. అజొల్లా వాడకం వల్ల పశుదాణా ఖర్చుల్లో 20 నుంచి 25 శాతం తగ్గించొచ్చు.

- వెన్నశాతం, ఎస్ఎన్ఎఫ్ విలువలు పాలలో పెరుగుతాయి. దీంతో లీటర్ పాలకు రూ.60 పైసల నుంచి రూ. 1.50 వరకు అధిక ఆదాయం పొందొచ్చు.
- అజొల్లాను పాడి పశువులకే కాక గొర్రెలు, కోళ్ల మేతలో కూడా దాణాకు ప్రత్యామ్నాయంగా (బదులు) వాడొచ్చు.
- లూజ్ అజొల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాతో కలిపి వాడొచ్చు. అజొల్లాను ఏ ఇతర పదార్థాలతో కలపకుండా కూడా దాణాగా వాడొచ్చు.

అజొల్లా తయారీ విధానం..

- రోజుకు 4 కిలోల అజొల్లా ఉత్పత్తి చేయడానికి 2.25 X 1.5 మీటర్ల కొలతలతో తొట్టి తయారు చేసుకోవాలి. (2.25 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు), 9 అంగుళాల లోతు.
- 150 జీసీఎం మందం, 2.5 X 1.8 మీటర్ల సైజ్ గల సిల్పాలిన్ (షీట్) తొట్టిలో పరచాలి.
- 10 నుంచి 15 కిలోల సారవంతమైన మట్టిని సమానంగా పాలిథీన్ షీట్‌పై పరచాలి. తర్వాత 2 నుంచి 5 కిలోల, రెండు రోజుల ఆరిన పేడ 40 గ్రాములు, సూపర్ పాస్ఫేట్ 10 లీటర్ల నీటిలో కలిపి ఆ మిశ్రమాన్ని గుంతలో పోసి బాగా కలిపి పెట్టాలి.
- తొట్టిలో 7 నుంచి 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకు నీరు ఉండేలా చూసుకోవాలి.
- 0.5 కిలోల నుంచి 1 కిలో అజొల్లా మదర్ కల్చర్‌ను గుంత అంతా సమానంగా చేయాలి. వేసిన వారం రోజులకు అజొల్లా గుంత అంతా అభివృద్ధి చెందుతుంది.
- కిలో అజొల్లా మదర్ కల్చర్ నుంచి వారం రోజుల్లో 8 నుంచి 10 కిలోల దిగుబడి వస్తుంది. ఏడో రోజు నుంచి అజొల్లాను ప్రతీరోజు వాడుకోవచ్చు.
- వారానికి ఒకసారి కిలో పేడను, 20 గ్రాముల లవ మిశ్రమాన్ని 5 లీటర్ల నీటితో గుజ్జుగా కలిపి తొట్టిలో వేయాలి.
- అజొల్లా పెంచడానికి ప్రత్యేకంగా స్థలం లేనివారు పండ్ల తోటలు, వాటిలో తొట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా షెడ్‌నెట్ల కింద నిర్మించుకోవచ్చు.
- ఉష్ణోగ్రత 20 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్య ఉండాలి. సూర్యరశ్మి నేరుగా పడకుండా ఆకులు చెత్త గుంతలో పడకుండా షెడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలి.
- తొట్టిలో తేలియాడుతున్న అజొల్లాను ప్లాస్టిక్ జల్లెడతో బయటకు తీయాలి. తొలుత వారం రోజులకు తర్వాత ప్రతీరోజు అజొల్లా సేకరించొచ్చు. తొట్టి నుంచి తీసిన అజొల్లాను మంచి నీటితో కడిగితే పేడ వాసన రాదు.

అజొల్లాలో ఉండే పోషకాలు..

- అజొల్లా డ్రై వెయిట్ బేసిస్ ప్రకారం 25 నుంచి 30 శాతం మాంసకృత్తులు, 10 నుంచి 15 శాతం మినరల్స్, 7 నుంచి 10 శాతం అమైనా ఆసిడ్స్, బయోయాక్టివ్ పదార్థాలు ఉంటాయి.
- ఎక్కువ మాంసకృత్తులు, తక్కువ లిగ్నిన్ ఉండడం వల్ల వేగంగా, తేలికగా, తక్కువ ఖర్చుతో పెరుగుతుంది. దీని వల్ల దీనిలోని పోషకాలను పశువులు, కోళ్లు, గొర్రెలు తేలికగా జీర్ణం చేసుకుంటాయి.
- అజొల్లా గురించి మరింత సమాచారం కోసం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్. కిశోర్‌కుమార్ సెల్ నంబర్ 99594 66904ను సంప్రదించొచ్చు.